# కన్నీటి వాసన

ఓ. రామచంద్రరాజు



"తాతా! రాజులయ్యసామికి నీల్లు బోస్తే వాన వస్తాదా?" అనుమానంగా తాతనడిగాడు మనవడు.

వేపచెట్టు క్రింద చతికిల బడి కూర్చొని రాజులయ్య గుట్టమీద జరిగే తతంగాన్ని గమనిస్తున్న తాత, మనవడి మాటకు బోసినోటితో పల్చగా నవ్వాడు.

బొడ్డులో దాచిన 'చెక్కపేడు' తీసి, రాతిమీద నలగ్గొట్టి, నోట్లో వేసుకుని చప్పరిస్తూ, 'మనవడి అనుమాన మెట్లా తీర్చాలా?' అని ఆలోచనలో పడ్డాడు.

ఎండ - చిటపటలాడే కొలిమిలోని మంటసెగలా వుంది. గాలి, ఎండ తీక్షణతకు భయపడి ఆకులమాటున అణిగివుంది.

ఊరికి పడమరగా, ఎండినెర్రలు బారిన కుంట ప్రక్కన ఎత్తైన గుట్టమీద నిలువెత్తు ఆకారంలో వున్నాడు రాజులయ్య స్వామి.

అక్కడ నుండి ఆ వూరి నలుదెసలా పరికిస్తూ, మంచెమీద నుండి పంటను కాపాడే రైతులా, రాజులయ్య స్వామి వాళ్లను కాపాడుతూంటాడని ఆ వూరి రైతుల నమ్మకం.

తమ కష్టాలు ఆ స్వామికి చెప్పుకుంటే తీరుస్తాడని ఆ వూరి వాళ్ళ విశ్వాసం.

అందుకే, యిప్పుడు ఆ వూరిలోని చిన్నా, చితకా, ఆడ, మగా అంతా రాజులయ్యస్వామి గుట్ట చుట్టూనిలబడి వున్నారు. వాళ్ళు భుజాలమీద నీళ్ళ కడవలు వున్నాయి. ఆ నీళ్ళను దాదాపు మూడు మైళ్లనుండి తీసుకు వచ్చిన అలసట వాళ్ళ ముఖాలలో కనిపిస్తున్నప్పటికీ, వానరావాలనీ, పొలాలన్నీ పండాలని, తమ బ్రతుకులు పచ్చపచ్చగా వుండాలనే తాపత్రయం అందరి మనసుల్లో నిండివుంది.

అరికాళ్ళు బొబ్బలెక్కేట్లు క్రిందనేల కాలుతున్నా, రాజులయ్యస్వామి వాన

[illegible] సి లెక్కచెయ్యక భక్తిగా, వినమ్రంగా నిలబడి వున్నారు.

గుట్టమీద రాజులయ్యస్వామి విగ్రహానికి పసుపు, కుంకుమపూసి, ఆకు, వక్క, ధూప, దీప నైవేద్యం స్వామికి సమర్పించే తంతుకొనసాగుతూవుంది. ఆ కార్యక్రమంలో పూజారి వీరభద్రయ్యకు చేదోడు, వాదోడుగా అవసరమైనవి అందిస్తూ తిరుగుతున్న గెడ్డం నెరిసిన వ్యక్తి పేరు శీతమరాజు.

"ఇంకెక్కడివాన! మనం ఆకలితో చావాల్సిందే! కాదంటే ఎక్కడికైనా పోయి ప్రాణాలు కాపాడుకోవాల్సిందే!" అనే వారికి ఆశలు కల్పించి, ఉత్సాహాన్నిచ్చి మూడవ సారి ముచ్చటగా రాజులయ్యస్వామికి పూజా కార్యక్రమం నిర్వహింపజేస్తున్నది ఆయనే.


"తాతా! చెప్పు?" తన మాటకు బదులు చెప్పకుండా అట్లే 'చెక్కపేడు' చప్పరిస్తున్న తాతను నిలదీశాడు మనవడు. "రాజులయ్యస్వామికి పూజచేసి నీల్లు బోస్తే వానవస్తాదా?"

"ఒరే మనవడా!" తాత అన్యమనస్కంగానే మొదలు పెట్టాడు". సత్తెమైన మనుసులుంటే, దేవుల్లు గుడకా సత్తెంగానే వుంటారు. మనుసుల్లో ముసలంపుట్టి ఆశపోతులై అడివిలన్నీ నరికేస్తుండ్రి. కనబడిన చెట్టునల్లా అన్నెంపున్నెం లేకుండా కొట్టుతూ వుండ్రి. "గంగమ్మ తల్లికి నీడగా, ఏపుగా పెద్ద యేప చెట్టుండె! ఆ పెసిలెంటు ఆఖరికి దాన్ని గుడకా నరికిచ్చి డిపోకు తోలుకొనె" తాత మాటలు మనవడికి రుచించక 'అసలు వానొచ్చిందా? రాలేదా?' అని బిక్కమొగం వేసుకొని 'వూ' కొడుతూవున్నాడు. నోటిలోని 'ఎంగిలి' తుపుక్కున వుమిసేసి తాత అసలు విషయానికొచ్చాడు

"ఒరే అబ్బీ! మాసిన్నప్పుడు యిట్నే పెద్ద కరువొచ్చినాది. ఎక్కడి పంటలక్కడ్నే కాగికాగి పోయినాయి. తాగే దానికి గుక్కెడు నీల్లు గూడ దొరకలా. ఊరిడ్సి పోదామని అందరం అనుకుంటిమి. ఆఖరి మాటగా రాజులయ్యసోమికి సెప్పిపోదామని మనిసికో కడవ సంకనేసుకొని పెద్దేటికి బోయి, పెద్ద సెలమదీసి కడవలనిండుకూ నీల్లెత్తుకొనొచ్చి రాజులయ్య సోమికి పూజలు సేసి, నీల్లోసి పొలిదండాలు బెట్టినాము ......... " తాతకు చెక్కపేడు నోట్లో అడ్డొచ్చి దగ్గ సాగాడు.

'ఆ తర్వాతేమైనాది? వానొచ్చిందా- లేదా?' మనవడికి ఉత్కంఠ ఎక్కువై తాతకు దగ్గు తగ్గి ఎప్పుడెప్పుడు అసలు విషయం చెపుతాడా? అని ఎదురు చూడసాగాడు.

గుట్టమీద పూజారి వీర భద్రయ్య పూజ ముగించి అందరికి హారతి కళ్ళకద్దుకునే




అవకాశమిచ్చాడు. అందరూ హారతి కళ్ళకద్దుకొని దేవుడిని వానకోసం ప్రార్థించారు. ఆ తర్వాత వీరభద్రయ్య అందరికీ 'ఇంకకానివ్వండి' అని సైగ జేశాడు.

"స్వామీ! రాజులయ్య సామీ! వానల్లు కురిపిచ్చు సామీ, మమ్ముల్ను సల్లంగ సూడు సామీ!" అంతా ఒక్కసారిగా గట్టిగా పలుకుతూ నీళ్ళ కడవలతోటి గుట్ట చుట్టూ ప్రదక్షిణంగా తిరగసాగారు.

ప్రక్కన కావళ్లలో వున్న వేపాకు మండలమధ్య, అంతకుముందు ఎక్కడి నుండో పట్టుకు తెచ్చిన పెద్ద పెద్ద కప్పలను వుంచి, పైన బురద నీళ్లు చల్లుతున్నారు కొందరు.

వానపడుతూ వుందని భ్రమించి కప్పలు 'బెక' 'బెక' లాడసాగినాయి.

రాజులయ్య స్వామి చుట్టూ ప్రదక్షిణలు ముగించి, కడవలలోని నీటిని ఒక్కొక్కరు వరుసగా స్వామి విగ్రహంపై పోసి, కడవను స్వామి ఎదురుగా బోర్లించి, భక్తిగానమస్కారం చేసి వాన కోసం ఆఖరి ప్రార్థన చేసి గుట్ట దిగి వస్తున్నారు.

స్వామి దగ్గర సందడిని గమనిస్తూ, తాత మాటను మరిచిపోయిన మనవడు అసలు విషయానికొచ్చాడు.

"కాని తాతా! ఆ పూయిన ఏమైంది?" ప్రొద్దు వాటారిందో లేదోనని అరచెయ్యి అడ్డంపెట్టుకొని కొమ్మల మధ్య నుండి గమనిస్తూన్న తాత సర్దుకొని చెప్పసాగాడు.

"ఒరే అబ్బీ! సిన్నరాజా! నువ్వు నమ్ముతావో లేదోగాని ...... రాజులయ్య సోమికి దండాలు బెట్టి అట్టాయింటికి తిరగమల్లినామో లేదో ..... ఆ మొబ్బు లెక్కడ కాసుకో నుండినాయో, ఆ వానెక్కడ దాక్కోని వుండినాదో, యింటికి బోయేతలికి ముద్ద ముద్దయినాము. ఎత్తుకోడ మెత్తుకోడం వాన రొండ్రోజులు బడినాది.

"ఎక్కడెక్కడి సెరువులూ నిండి నాయి, ఎక్కడెక్కడి బాయిలూ పొంగినా యనుకో, మేమంతా యీదుల్లోకొచ్చి సిందులేసినాం. అదీ రాజులయ్య సత్తెమంటే ...... " తాత చిన్న రాజాకు గతం చెప్పి నిట్టూర్చాడు.

చిన్నరాజా రాజులయ్య మహిమ విని చాలా సంతోషించాడు. వెంటనే ఆకాశం కేసి ఆవంక, ఈ వంక తేరిపార జూశాడు.

"ప్చ్ ..... ఒక్క మొబ్బు తునక గూడాలేదు" అనుకొని రాజులయ్య స్వామికేసి చూశాడు. కార్యక్రమమంతా అయిపోయి, ఎవరి ఖాళీ కడవ వాళ్ళు చేతుల్లో వూపుకుంటూ నిశ్శబ్దంగా యిళ్ళకు పోతున్నారు.

తన తండ్రి శీతమరాజు మాత్రం యింకా రెండు చేతులెత్తి అట్లే స్వామికి మ్రొక్కుతూ వున్నాడు.

చిన్న రాజా తాత చెయ్యి పట్టుకొని పైకి లేపుతూ "రా తాతా! తొందరగా యింటికి పోదాం! మల్లా వానొస్తాది" అన్నాడు. తాత వేదాంతిలా నవ్వుతూ పైకి లేచాడు.

* * * * * * * * * * *

చీకటి పడకముందే అన్నందిని ఆరుబయటనులకమంచం వాల్చుకొని పడక సర్దుకొంటున్నాడు శీతమరాజు.

పిల్లలు, చేతులు పట్టుకొని "వానల్లు కురవాలి వానదేవుడా! వరిచేలు పండాలి వానదేవుడా!" అంటూ ఆడుకుంటున్నారు.

"ఓ శీతంరాజు మావా! మంచం బయటేసుకుంటన్నవ్. [illegible] వానొచ్చి ముద్దముద్దయి పోతావ్. జా[illegible]!" మిద్దపైకి పోతూ ప్రక్కింటి వెంకట్రాజు పరాచికాలాడాడు.

"ఆ! రానీ, రానీ ...... దిగులు నిండిన కంఠంతో, నిరాశగా సమాధానమిచ్చాడు శీతమరాజు.

చిన్నరాజా పిల్లలతో ఆడుకోవడం ఆపేసి తండ్రి ప్రక్కన కూర్చొని "అయ్యా! అయ్యా! అన్నాడు. "ఏం నాయనా!" బరువుగా పలికాడు తండ్రి.

"వానింకా రాలేదే?" పిల్లవాని మాట శీతమరాజుకు కడుపులో దేవినట్లయింది. కొడుక్కు ఏమీ సమాధానం చెప్పలేక ముభావంగా ఆలోచించసాగాడు.

"రాజులయ్యసామికి నీల్లుగూడా పోసినాం గదా! చెప్పు! వానెందుకు రాలే". శీతమరాజు కొడుకు ముఖంలోకి ఆవేదనగా చూశాడు. గుబులు గుబులుగా పుట్టుకొస్తున్న దుఃఖాన్ని బలవంతంగా అణచుకున్నాడు.

తండ్రి స్థితిని అర్థం చేసుకోలేక కొడుకు 'వానెందుకు రాలేదో చెప్పమని వేధించసాగాడు.

"రేయ్! నువ్వు పో ...... యిక్కడ నుండి "శీతమరాజులోని అసహనం కోపంగా మారి కొడుకును ఒక్కసారిగా కసురుకున్నాడు. ఊహించని తండ్రి కోపానికి బిత్తరపోయి చిన్నరాజా బావురుమన్నాడు.

అపుడే యింట్లో నుండి బయటకు వచ్చిన లక్ష్మీదేవమ్మ ఏడుస్తున్న కొడుకును తీసుకొని అరుగు మీదికి పోయి కూర్చుంది.

"ఏందిరా, మీ అయ్యను ఏడిపిస్తా వుండావు?" అంది. చిన్నరాజా తల్లిని అల్లుకుపోయి ఎక్కిళ్ళు పెడుతూ విషయం చెప్పాడు.

"నీ కెందుకు నాయనా అంతటి ఆలోచన? వాన రాలేదని ముందుగానే మీ అయ్య కుమిలిపోతాంటె ..... " తల్లి మాట పూర్తి కాకుండానే, చిన్న రాజా అందుకున్నాడు.

"అదిగాదు మా! మా! యిను "తల్లి ముఖం తనవైపు తిప్పుకొంటూ "వానొస్తే ...... సేనీకాయలు కోస్తాము గదా! వాట్నమ్మిన లెక్కతో అయ్య నాకు కొత్త గుడ్డలు తెస్తానని శానా రోజుల్నుండి సెప్తున్నాడు గద మా! సూడు ..... ఈ సెడ్డి సినిగిపోయింది. పోస్టాపీసని అందురూ ఎక్కిరిస్తున్నారు మా ....... అ ..... అ....." అంటూ చిన్నరాజా పొగిలి పొగిలి ఏడవసాగాడు.

కొడుకు మాటలకు తల్లి గుండె చెదిరిపోయింది. చిన్నరాజాను దగ్గరకు లాక్కొని అట్లే హృదయానికి హత్తుకొంది.

శీతమరాజు భార్య, బిడ్డ పరిస్థితి గమనించి మంచంలోనే కరిగి నీరైపోయాడు. ఒక కన్నీటి చుక్క జారి నోటిలో కొచ్చి వుప్పగా తగిలింది. కొడుకును ఓదార్చాలన్పించినా నోరు పెగలక అట్లే చూస్తూండిపోయాడు.

'సేనికాయలు కోత కోస్తే, కొడుక్కు కొత్త గుడ్డలేంది, శానాశానా ఆశలే పెట్టుకోనుంటి, అన్నీ పిచ్చుక గూళ్ళమాదిరి కూలిపోయె. వానిప్పుడు పడినా చెట్లు బతకవేమొ. ఐయ్యాలకు సచ్చేపోయి నాయేమో!

'ఐదేండ్ల నుండి బిడ్డల మాదిరి సాకిసంతరిస్తె, ఈయొడు పూతయిరగ బూసింది. పూత పిందెగా మారే లోపల బాయెండిపోయె. రెండు నెల్లు నీల్లు లేక పెద్దపెద్ద బంతుల్లావుండాల్సిన కాయలు



అత్తికాయల్లా రాలిపోతాండె. 'ఉడికిన అన్నాన్ని దించుకోలేక పొయ్యిలో వొలక బోసుకున్నట్లాయె'.

'అప్పొచ్చిన మారాజు కరువొచ్చింది జూసి అగ్గవగా కొట్టెయ్యొచ్చని భూమి రాయించమని తొందర బెడతాండె'.

'బ్యాంకోల్లు నిరుటి వంతు ఇంకా కట్టలేదని యింట్లో బోకులు బైటేస్తామని బెదిరిస్తావుండ్రి .

'అల్లునికియ్యాల్సిన కట్నం అట్నే మూడేండ్ల నుండి మూలిగి మూలిగి పెద్ద పిల్ల యిల్లుజేరి మూలుగుతాండె. ఆడబిడ్డను యింట్లో అట్టానే పెట్టుకోనుంటె, యిరుగు పొరుగు వాళ్ల గుసపాల్లాంటి గుసగుసలెక్కువైపోయె.

'దొడ్లో గెడ్డి లేక గొడ్లు తాల్లు దెంచుకొని ఎలబారిపోతాండె.

'తినే దానికి గింజలైపోయె. 'ఇంగ యిల్లిల్లు తిరిగి చేబదుల్లు తెచ్చి కూడొండడం తన వల్ల కానేకాదని భార్య రోయింపు జేస్తా వుండె'. ఏ దారీ కానరావడంలేదే? ఎట్టా సెయ్యాల?'

అర్థరాత్రి దాటిందాకా శీతమరాజు కునుకు లేక నులక మంచం మీద అటు పొర్లి, ఇటు పొర్లాడు.నట్టనడి సముద్రంలో చిల్లులు పడిన నావలాగా అతడికి జీవితం అతలాకుతలంగా తోచింది.

అదిగో ...... అప్పుడు రాలిందో చినుకు, 'టప్'మని అతడి కనురెప్పపై. అతడు గమనించేలోపు యింకోటి ..... పడింది. అంతే! గబుక్కున లేచి కళ్ళు తెరచి ఆకాశంకేసి చూశాడు.

కరిమబ్బు దట్టంగా కమ్ముకొని మంది తూర్పువైపు వురుములు, మెరుపులు అతడిలో ఆశను రేకెత్తించాయి.

"దేవుడా! దేవుడా! వాన్దేవుడా! కురుసుసామీ! కానీ ...... యింకా ...... యింకా ......" శీతమరాజుకు పోయిన ప్రాణం తిరిగి వచ్చినట్లయింది. వాన పల్చగా పడసాగింది. అతడట్లే ముడుచుకొని పడుకున్నాడు. "కాని సామీ! 'నాకేమయినా ఫరవాలే. నా బతుకును గెడ్డెన యెయ్యి సామీ! ఓ రాజులయ్య సామీ! ఓ ఎంగటేశ్వరసామీ! ఒంటి మిట్ట రాముల్సామీ!" ....... అతడుకళ్లుమూసుకొని, మదిలోకొచ్చిన ప్రతి దేవుడికి మొక్కసాగాడు.

"ఇగిగో! నిన్నే! వానపడతాంది. మంచం పందిట్లో కీడ్సుకో". భార్య పిలిచింది. అతడు పలకలేదు. సద్దు చేస్తే ఎక్కడ వాన ఆగిపోతుందోనని భయం.

మంచి వానాకాలంలో గూడా దేశమంతా వరదలొచ్చేలా వాన కురిస్తే, వాళ్ళకు మాత్రం వానముసురు పది రోజులుండి చెప్పా పెట్టకుండా వెళ్ళిపోయింది. వాన పడిందన్నమాటేగాని అరికాలు తడిసిన పాపాన పోలేదు.




ఇప్పుడు వాన కొంచెం చిటపట లాడుతూ పడుతూ వుంది. భార్య పోరు పడలేక మంచం పందిరి క్రిందకు లాక్కొని గొంతు కూర్చున్నాడు. వాన బాగా కురిస్తే, ఎర్రెర్రగా ఎండి వున్న మట్టి నీటితో కలిసినపుడు వచ్చే వాసన గట్టిగా, గుండెలనిండుగా పీల్చుకొని అదమరచి నిద్రపోవాలని శీతమరాజు ఆశపడ్డాడు.

ఆ రాత్రి తెల్లవారిందాకా అప్పుడో చినుకు, అప్పుడో చినుకు పడి అయిందన్పించి వచ్చినంత వేగంగా మాయమై పోయింది. మాగన్నుగా గొంతు కూర్చొని జోగుతున్న శీతమరాజుకు వాన శబ్దం రాకపోయేటప్పటికి చటుక్కున లేచి, వీధిలోకి పోయి చూశాడు. ఆకాశం చాలా అమాయకంగా, నిర్మలంగా, తేటగా కన్పించింది.

"ఛూ! నీయమ్మా! అని కసిదీరా ఉమ్మేసి అక్కసు తీర్చుకున్నాడు.

* * * * * * * * * * * * * * * *

"ఇదిగో అల్లుడా, అల్లుడా! సచ్చి నీకడుపున బుడతా! నీ మేలు జనమ జనమలకు మర్సిపోను. నా చీని తోట ఎండిపోతాంది. తోట దిక్కుజూస్తే గుండె లవిసిపోతాండాయి. ఒక్కతడి నీల్లేసి నావంటే ...... " సుబ్బారెడ్డిని శీతమరాజు బ్రతిమిలాడినాడు

సుబ్బారెడ్డి ప్రక్క ఊరి రైతు. యాభై వేలు ఖర్చు పెట్టి ఐదొందలడుగుల పెద్ద బోరింగు వేయించాడు. నీళ్లు పుష్కలంగా పడినాయి. నీళ్ళకోసం అతడిచుట్టు ప్రక్కల రైతులంతా సలాములు చేస్తున్నారు. బలవంతంగా అతడి చేతుల్లో డబ్బులు కూరి ఎండిపోతున్న పంటలను దక్కించుకోవాలని, నోటిమాట కోసం అంగలార్చుతున్నారు.

ప్రక్కన మోటారులో నుండి నీళ్ళు ధారాపాతంగా కాలవలో పడుతున్నాయి. వాటిని జూస్తూ వుంటే శీతమరాజుకు కాళ్ళూ చేతులు చల్లబడినట్లన్పించింది.

ప్రక్కనవున్న రైతుకు ఏదో చెప్పి పంపించి, కాసేపు ఆలోచించి చెప్పాడు.

"శీతమరాజు మామా! నిన్ను జూస్తుంటే నాకు బాధేస్తాంది. అయినా నీతోటెక్కడ, నా నీల్లెక్కడ సోమీ!

రెండువైపుల్లుండాదే, నీకెట్లా వస్తాయి అంతదూరం? ఆలోసించి సెప్పు?

"ఎట్టనో కట్ట, కాలవజేసుకుంటా, ఇంట్లో వాల్లందరమూ వొచ్చి నీల్లు యేస్టుగాకుండా రాత్రిల్లు కట్టుకుంటా అల్లుడా, నీకు పున్నె ముంటాది. "నీళ్ళు వేస్తాడనే ఆశకొద్దీ అతడి మాటకోసం పడిగాపుల కాశాడు శీతమరాజు. అతడి అవస్థను జూసి సుబ్బారెడ్డికి నవ్వొచ్చింది. 'అయినా పాపం మనిషి మంచోడునొప్పించకూడద'నుకొని ఆప్యాయంగానే తిప్పి పంపాలనుకున్నాడు.

"మామా! నా నీల్లు నీకు పారేటట్టయితే అందరినీ పక్కకు తోసి నీకే నీల్లేసేవోడిని సోమీ! అంతదూరం నీల్లు రావు. బూమిలోనే యిరిగిపోతాయి. "శీతమరాజు కొంచెం ఆలోచనలోపడడం గమనించి తిరిగి అందుకున్నాడు సుబ్బారెడ్డి.

"ఒక్కతడితో నీ సెట్లు బతుకుతాయా సెప్పు? అయినా నీ తోట వాలకం జూస్తే యింగ నువ్వేం జేసినాఅయి తెపుర్లుకోలేవు. ఎందుకు వృధాగా వాటికోసం పేనాలొదుల్తావు. నా మాటిను ..... నిన్ను కాదనలేక నీల్లెయ్యాలన్నా ఈ అడ్మాన్సు లిచ్చినోల్లయ్యి ముందు పారాల గదా!" సుబ్బారెడ్డి మాటలు వింటుంటే శీతమరాజుకు నవనాడులూ కుంగినట్లన్పించింది. దింపుడు కల్లం ఆశగూడా పోయిందని ముఖం దిగాలేసుకొని వెనుదిరిగాడు శీతమరాజు.

"ఏమీ అనుకోకు మామా! నీకు సెప్పాలంటే నోరు రావడంలే. ఆసెట్లెప్పుడో ఎండి పోయినాయి". సుబ్బా రెడ్డిని దాటుకొని వస్తుంటే అన్నాడు.

"ఆ సెట్లల్లో నే శీతమరాజు పేనం కొట్టకలాడుతోంది. రేయింబవల్లు ఆ సెట్లే జీవితమన్నట్లుగా వుండినాడు. అయ్యెప్పుడో చేజారి పోయినాయి. వాట్ని నరికేసి కట్టలడిపోతు వేస్తే యింత లెక్కన్నా వస్తాది". శీతమరాజు కొంచెం దూరం నడిచాక ఎవరో అన్నారామాటలు.

కళ్లు పీక్కుపోయి, కడుపు మడికిపోయి, శవంలాగా నడుస్తూ పూజారి యింటి దగ్గరకు వచ్చాడు శీతమరాజు. వీరభద్రయ్య అరుగుమీద కూర్చొని పంచాంగం ముందరేసుకొని, ఎదురుగా కూర్చొని వున్న వాళ్ళకేదో లెక్కవేసి చెప్పుతున్నాడు. ఆ ప్రక్కగా పోయి ముఖం వేలాడేసుకొని నిలబడ్డాడు శీతమరాజు.

"ఏమయ్యా! శీతమరాజూ! కూర్చో ..... అలా నిలబడే వున్నావు " మర్యాదగా పల్కరించాడు వీరభద్రయ్య. పంచాగం చెప్పించుకుంటున్న వాళ్ళు తిరిగి చూశారు.

"అయితే యింగవాన రాదంటారా సాములూ?" నూతిలో నుండి అడిగినట్లుగా అడిగాడు శీతమరాజు.

"ఇంకెక్కడి వానరాజూ! రాజులయ్యా స్వామివారి మహత్యం గూడా లెకపోయె. మనం పూజలు చేసి వారందాటిపోయెగదా!" అతని బాధతో తన స్వరం మిళితం జేసినట్లుగా అన్నాడు పూజారి వీరభద్రయ్య. "సకాలంలో వానలు పడడం మానుకున్నాయి. 'ఉత్తర జూచి ఎత్తర గంప, విశాఖ జూచి విడువర కొంప' అని పెద్దోళ్లు ఊరకే అన్నారా!" ఆయన మాట పూర్తి కాకుండానే కడుపులో బాధ తట్టుకోలేక యింకోమాట న్నాడు శీతమరాజు.

"మరి ఉగాదినాడు పంచాంగం సెపుతూ, ఈయేడు వానలు బాగాకురుస్తాయంటిరే!"

వీరభద్రయ్య ఎదురుగా వున్న వాళ్ళవైపు యిబ్బందిగా జూసి "శాస్త్రమట్లా చెప్పిందిమరి. అయినా నీకు తెలియదా 'వానరాకడ, ప్రాణం పోకడ ఎవరు చెప్పొచ్చారు". అతడిని వదిలించుకోవాలని ఆ మాటలంటూ తిరిగి పంచాంగంలో పడ్డాడు.

ఉసూరుమంటూ అక్కడ నుండి పెద్ద నిట్టూర్పు విడిచి బయలుదేరాడు శీతమరాజు. ఇల్లు, భార్య పిల్లలు, తండ్రి గుర్తుకు వచ్చి అతడి కోసమే వాళ్ళు ఎదురుచూస్తున్నట్లుగా భావించాడు. ఇంటికి రావాలంటే బాధాకరంగా అన్పించి, అటుతిరిగి తోటవైపు నడిచాడు.

పైటాలయ్యింది. ఎండ నిప్పులు చెరుగుతూనే వుంది.తోట మొగదలలోని బావి దగ్గరకు పోయి, 'బావిలో కనీసం తేమయినా వుందా' అని తొంగి చూశాడు. అదెప్పుడో ఎండిపోయి రాళ్ళూ, రప్పలు బయట పడి తనను జూచి పేలవంగా నవ్వుతున్నట్లన్పించింది.

బావి ప్రక్కనున్న మోటారు షెడ్డు పడిపోయి బోసిగా వుంది. అతడి మేనమామ కొడుకు నాగరాజు, అతడు యిద్దరూ కల్సి చేసి చెట్లను నాటేముందర మోటారు బిగించుకున్నారు. బావిలో నీళ్లు దండిగా వున్నప్పుడు మోటారు నీటిని కాలవలోకి ఎగ జిమ్ముతుంటే యిద్దరూ నీళ్ళను కుశాల కుశాలగా కట్టుకున్నారు.

బావి ఎండిపోయేటప్పటికి నాగరాజు భూములను, మోటారును కల్పి అమ్మివేశాడు. అత్తగారివూరికి పోతూ అంతకుముందే తను నాగరాజుకు పడిన బాకీకిగాను మోటారులోని సగభాగం చెల్లవేసుకున్నాడు. ఆ సంగతంతా గుర్తుకు వచ్చింది శీతమరాజుకు.

---

### హైకూలు

స్కూలులో చెట్లు.
గాలిలో
కేరింతలు నెమరేసుకొంటూ

* * *

కిటికీ.
గోడకి తగిలించిన
చిత్రపటం.

* * *

కాలం.
కాంతి కుంచెతో
అవిరామ చిత్రరచన.

* * *

వానమట్టి.
భూమి
స్వప్న నేత్రాలు తెరుస్తోంది.

* * *

వేకువ సంధ్య.
బంగారు పుటలు
తిరగేస్తూ కాలం.

బి.వి.వి ప్రసాద్.

---

బరువుగా అడుగులు వేస్తూ తనతోటలోకి నడిచాడు. రెండెకరాల చీనీ తోట ఎండిపోయి స్మశానంలా కన్పించింది. ఎండుపుల్లలు పడి పచ్చపచ్చగా వుండాల్సిన కొమ్మలన్నీ, నిక్కబొడుచుకున్న పిశాచి వెంట్రుకల్లా అన్పించాయి.

కొన్ని కాయలు ఎండి కొమ్మల నుండి రాలకుండా వొుండిగా అట్లే అంటిపెట్టుకుని వున్నాయి. చెట్ల మొదళ్ళలో రాలి పోయిన ఆకులు, కాయలు వెదజల్లినట్లుగా వున్నాయి.

శీతమరాజు తోటంతా పిచ్చిపట్టిన వాడిలాగా తిరుగుతూ ప్రతి చెట్టును నిశితంగా చూశాడు. ఆప్యాయంగా కొమ్మలను రెండు చేతులతో కౌగలించుకుంటూ తడిమి తడిమి చూస్తున్నాడు. ఒక కొమ్మ దగ్గరకు వచ్చి బొటన వేలిగోరుతో యింకా పసిమివుందాలేదా అని గిల్లి, చనిపోయిన బిడ్డ నాడి యింకా ఏమైనా ఆడుతూవుందా అన్నంత ఆశగా చూశాడు. దుఃఖంతో అతడి కళ్ళలోని నీరు ఆవిరైపోయినట్లు, కొమ్మలోని పసిమి కొమ్మపాదాలలోకే యిగిరిపోయిందని గ్రహించి అక్కడే గుండెను చేత్తో పట్టుకొని కూర్చుని చింతించసాగాడు.

ఈ చెట్లను నాటిన మూడు నెలలకు తనకు కుమారుడు కల్గాడు. ముగ్గురు కుమార్తెల తర్వాత కొడుకు పుట్టడం, ఈ చీనీ చెట్ల పుణ్యమేనని సంబరపడి, పిల్లవాడికి 'చీనీ రాజు' అని పేరు పెట్టుకున్నాడు. చెట్లపైని తన మమకారం విడ్డూరంగా వుందని వూళ్ళో అందరూ ఎగతాళి చేశారు. ఇంట్లో వాళ్ళు చివరకు పిల్లవాడిని 'చిన్నరాజా' అని పిలువ సాగారు. తను మాత్రం వాడిని యిప్పటికీ 'చీనా రాజా' అనే పిలుస్తుంటాడు.

తన ఆశలన్నీ కొడుకుల్లాంటి ఈ చెట్లపైనే నిలిపి ఎండనకా, వాననకా ఈ చెట్లకే అంకితమై పోయాడు. ఎన్ని అప్పులు చేసినా ఈ చెట్ల మీది ధీమాతోనే చేశాడు. చివరికి 'ఈన గాచి నక్కల పాలుజేసినట్లయింది'.

బరువెక్కిన గుండెతో, చెట్లకు తనకు గల విడదీయరాని అనుబంధాన్ని నెమరు వేసుకొని అలిసిపోయాడు. చివరికో నిర్ణయానికొచ్చాడు.

'నేనేయింత అధైర్యపడితే నా బిడ్డల బతుకేంగాను!' పోయిన పేనాన్ని ఎవరు మాత్రం యెనక్కు తెస్తారు? నాకీ చెట్లు ప్రాప్తం లేవనుకుంటాను. వీట్ని నరికి కట్టెలడిపోకేస్తాను. కొన్ని రోజులైనా పూట గడవకపోదు'. అనుకొని గుండెలు చిక్కబట్టుకొని పైకి లేచి, క్రిందనున్న తువ్వాలును భుజం మీద వేసుకొని యింటికి బయలు దేరాడు.

తోటలోనుండి బయటికి వస్తూ చివరి చెట్టు దాటబోతున్నాడు. అంతలో భుజం మీద వేలాడుతూవున్న తువ్వాలు కొసను ఎవరోపట్టుకొని లాగినట్లన్పించి, గబుక్కున వెనక్కు తిరిగి జారిపోతూవున్న తువ్వాలును అందుకోబోతే కొస అందింది. 'ఎవరదీ'అనబోయి అట్లే క్షణకాలం నిలబడిపోయి చూశాడు.

తువ్వాలు కొస ఎండిపోయిన రెమ్మకు తగులుకుంది. ఇంకో కొస అతడి చేతిలో వుంది. మాటలు రాని బొమ్మలా వుండి పోయాడు. సూర్యుడి ఏటవాలు కిరణాలు అక్కడి దృశ్యంపైబడి కరిగి క్రింద రాలిపోతున్నాయి.

"నీ చల్లని చేతులతో మమ్ము పెంచావు! అదే చేతులతో నరికేయబోతున్నావు. ప్రపంచంలో యింతకు మించిన విషాదముంటుందా?

'నీ కష్టాన్నంతా ఎరువు చేసి మాకు ఆహారంగా పెట్టావు - ఆనందపడ్డాము'.

'నీ కాయాన్నంతా మాకు పణంగా పెట్టావు - నీ త్యాగానికి అణువణువునా పులకించిపోయాము"

'కృతజ్ఞతగా పండ్లు, ఫలాలనిచ్చి నీ ఋణం తీర్చుకోవాలని ఆరాట పడ్డాము - కర్కశంగా కరువు కోరలు జాచి మమ్ము కబళించింది.'

'ఈ కట్టెలు చివరికి నీకో రోజు కడుపునిండా తిండి పెడతాయనుకుంటే అంతకుమించిన సార్థకత మాకింకేముంది?'

'ఎంతో చేసిన నీకు, ఏమి చేయలేని మమ్ములను క్షమించావంటే ....... శ ... ల.... వు ... తీ .... సు .... కుం .... టాం ....'

శీతమరాజు కడుపు కోతతో విలవిల్లాడి అక్కడే కుప్పగా కూలిపోయాడు.

ప్రీతి పాత్రమైన కొడుకును స్మశానంలో ఖననం చేసి బలవంతంగా యిల్లు జేరిన తండ్రిలా సూర్యుడు అస్తమించాడు.

